# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 233 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 20 ఆగస్టు 2025


## భవిష్యత్ అంతా హార్టికల్చర్‌దే



2లో

## గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్న వేముల రమేష్



3లో

## మిగ్-21 విమానాలకు వీడ్కోలు... ఛండీగఢ్ లో చివరి ల్యాండింగ్!

భారత వాయుసేనలో ఒక శకం ముగింపు..


చివరిసారిగా గాల్లోకి మిగ్-21

సెప్టెంబర్ 19న చండీగఢ్‌లో చివరి ల్యాండింగ్

1971 యుద్ధంలో కీలక పాత్ర పోషించిన యుద్ధ విమానం

ప్రమాదాల కారణంగా 'ఫ్లయింగ్ కాఫిన్' అనే అపవాదు

తేజస్ విమానాల ఆలస్యంతోనే సేవల కొనసాగింపు




2లో.

## ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచడమే లక్ష్యం

ప్రధాని మోదీతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కీలక సమావేశం

సరిహద్దు సమస్య పరిష్కారంపై 24వ విడత ప్రత్యేక ప్రతినిధుల చర్చలు

భారత్ లేవనెత్తిన మూడు కీలక అంశాలపై చర్యలు తీసుకుంటామని చైనా హామీ



2లో.

# విద్యా ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు

రాజకీయ రిజర్వేషన్ల అవసరం లేదు

ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించడం లేదు

కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ప్రత్యామ్నాయం

వికారాబాద్ పర్యటనలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు



**వికారాబాద్,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను సైతం మోసం చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాబోయే ఏ ఎన్నికలు అయినా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత మొదటిసారి వికారాబాద్ జిల్లాకు రాంచందర్ రావు వచ్చారు.జిల్లా పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాంచందర్ రావుకు ఘనస్వాగతం పలికారు. ఆయనను బీజేపీ శ్రేణులు గజమాలతో సన్మానించారు. తేజ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని రాంచందర్ రావు ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని రాంచందర్ రావు ధ్వజమెత్తారు. విద్య, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని.. రాజకీయాల్లో అవసరం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి లేదని... నిజంగా చిత్తశుద్ధి ఉంటే, బీసీల జాబితాలో ముస్లింలను ఎందుకు చేరుస్తున్నారని అన్నారు. బీసీలకు ఇప్పటికే బీసీ-బీ, బీసీ-ఈ, ఈబీసీ కింద రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని... రిజర్వేషన్లు విద్య, ఉద్యోగాల్లో మాత్రమే ఉండాలని... రాజకీయాల్లో మాత్రం ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. మిగతా2లో...

## ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి



2లో

విపక్షాల కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు తేజం!

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ రెడ్డి

ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా

ఏకగ్రీవం చేయాలన్న అధికార పక్షం ఆశలకు గండి



## కాళేశ్వరం కమిషన్ నివేదిక... హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

2లో.

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్లు

పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదన్న కేసీఆర్

## తెలంగాణ రైతులకు అన్యాయం చేయొద్దు


యూరియా కోటా విడుదల చేయండి

కేంద్రానికి సిఎం రేవంత్ రెడ్డి వినతి



**హైదరాబాద్,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** తెలంగాణ రైతాంగానికి అవసరం మేరకు యూరియాను తక్షణం సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణపై వివక్ష చూపించొద్దని అన్నారు. కేటాయించిన వాటా మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా చేయకపోవడంతో తలెత్తుతున్న సమస్యలను తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులకు వివరించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు రైతాంగానికి తలెత్తాయని పేర్కొన్నారు. మిగతాది 2లో...

## వాటి ధరలు తగ్గించండి.. అప్పుడు అన్ని ధరలు తగ్గుతాయి: కెటిఆర్



**హైదరాబాద్,ఆగస్టు 19(పిసిడబ్ల్యూన్యూస్):**గత పుష్కరకాలంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను పెంచి లక్షల కోట్ల రూపాయలను కేంద్రం ప్రజల నుంచి దోచుకుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. జిఎస్టీ స్లాబ్ రద్దు లేదా మార్పు అని.. వీటి ద్వారానే ప్రజల జీవితాల్లో నిజమైన దీపావళి వస్తుందంటూ కేంద్ర సర్కార్ ప్రచారం చేస్తుందని విమర్శించారు. బుధవారం జిఎస్టీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో కేంద్రానికి కెటిఆర్ బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు ప్రతినెల వేలాది రూపాయలు పెట్రోల్, ఎల్పిజి, డీజిల్ రూపంలో భారం మోపుతూ.. జీఎస్టీ స్లాబ్ మార్పు వలన కేవలం పదుల రూపాయల భారం తగ్గిస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు."ధరల తగ్గింపుపైన చిత్తశుద్ధి ఉంటే.. దానికి ప్రాథమిక కారణమైన పెట్రోల్ ధరలను తగ్గించాలి. పెట్రోల్, డీజిల్ తగ్గితే రవాణా భారం తగ్గి.. దాదాపు అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయి. పెట్రోల్, డీజిల్, ఎల్పిజిపైన పన్నులు తగ్గించి.. సెస్సులను మిగతా2లో...

# బెట్టింగ్ యాప్‌లకు అడ్డుకట్ట

- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు కేబినేట్ ఆమోదం
- నేడు పార్లమెంట్‌ముందుకు బిల్లు వచ్చే అవకాశం
- కోటా-బురిడీలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం
- కటక్-భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి ఓకే
- కేంద్ర కేబినేట్ పలు కీలక నిర్ణయాలు




2లో.

## ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా

# జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి

**న్యూఢిల్లీ,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):**ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో విపక్షాల ఇండియా కూటమి తమ అభ్యర్థిని ఖరారు చేసింది. ఎవరూ ఊహించని విధంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, తెలంగాణకు చెందిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పేరును ఈరోజు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవం కావాలన్న అధికార పక్షం ప్రయత్నాలకు ప్రతిపక్షాలు గండికొట్టినట్టయింది.జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయవ్యవస్థలో విశేషమైన అనుభవం ఉంది. ఆయన 2007 నుంచి 2011 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. ఆ తర్వాత గోవా లోకాయుక్తగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. న్యాయ వ్యవస్థలో ఉన్నత స్థాయిలో పనిచేసిన తెలుగు వ్యక్తిని ప్రతిపక్షాలు తమ అభ్యర్థిగా ఎంపిక చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇప్పటికే అధికార ఎన్డీయే కూటమి తమ అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన సీపీ రాధాకృష్ణన్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి బదులుగా ఇండియా కూటమి సైతం దక్షిణాది నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించుకుంది. అనూహ్యంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తెచ్చింది. దీంతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరు ఇద్దరు దక్షిణాది నేతల మధ్య ఆసక్తికరంగా మారింది. ఈ ఎంపిక ద్వారా ప్రతిపక్షాలు కేవలం పోటీ ఇవ్వడమే కాకుండా, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖుడిని బరిలోకి దించి వ్యూహాత్మకంగా వ్యవహరించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కాళేశ్వరం కమిషన్ నివేదిక... హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

**హైదరాబాద్,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్లు హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదని, ఆ కమిషన్ సమర్పించిన నివేదికను కొట్టివేయాలని వారు కోరారు.జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్, హరీశ్ రావు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించరు. ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ నివేదిక ఆ విధంగా ఉందని వారు పేర్కొన్నారు.కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## తెలంగాణ రైతులకు అన్యాయం చేయొద్దు

(మొదటి పేజి తరువాయి)

ఈ విషయంలో పార్లమెంట్ సభ్యులు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. యూరియా సరఫరా విషయంలో సీఎం రేవంత్ స్వయంగా కేంద్ర మంత్రికి వివరించడమే కాకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు దఫాలుగా లేఖలు రాసిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ రాష్ట్ర అవసరాల మేరకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రం వివక్ష చూపుతోందని అన్నారు. రైతుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా ఎంపీలు ఆందోళన సాగిస్తున్నప్పటికీ కోటా మేరకు యూరియా విడుదల చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆక్షేపించారు. అవసరమైన మేరకు తక్షణం యూరియా సరఫరా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## మిగ్-21 విమానాలకు వీడ్కోలు... ఛండీగఢ్‌లో చివరి ల్యాండింగ్!

**న్యూఢిల్లీ,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** భారత వాయుసేన చరిత్రలో చెరగని ముద్ర వేసిన మిగ్-21 యుద్ధ విమానాల ప్రస్థానం ముగింపు దశకు చేరుకుంది. ఆరు దశాబ్దాల పాటు దేశానికి సేవలందించిన ఈ తొలి సూపర్ సోనిక్ ఫైటర్ జెట్, సెప్టెంబర్ 19న చండీగఢ్ ఎయిర్‌బేస్‌లో తన చివరి ల్యాండింగ్ చేయనుంది. 1963లో వాయుసేనలో చేరిన ఈ విమానం, తన వేగం, చురుకుదనంతో ఒకప్పుడు ఆకాశంలో రారాజుగా వెలిగింది.యుద్ధ క్షేత్రంలో అసమాన ధీరుడు1971 భారత్-పాక్ యుద్ధంలో మిగ్-21 విమానాలు కీలక పాత్ర పోషించాయి. ఆ యుద్ధంలో పాల్గొన్న ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) పృథ్వీ సింగ్ బ్రార్ తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. పాకిస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌పై రెండు 500 కేజీల బాంబులు జారవిడిచి, శత్రువులకు చెందిన నాలుగు ఎఫ్-86 సాబ్రే జెట్‌ల నుంచి చాకచక్యంగా తప్పించుకున్నానని ఆయన తెలిపారు. "మృత్యువుకు క్షణాల దూరంలో ఉన్నాననిపించింది. కానీ మిగ్-21 వేగం, నా శిక్షణ నన్ను కాపాడాయి" అని బ్రార్ వివరించారు. 2019లో వింగ్ కమాండర్ అభినందన్ వర్థమాన్ నడిపిన మిగ్-21 బైసన్, పాకిస్థాన్‌కు చెందిన ఆధునిక ఎఫ్-16 విమానాన్ని కూల్చివేసిందని భారత్ ప్రకటించగా, పాకిస్థాన్ ఈ వాదనను ఖండించింది.

## వాటి ధరలు తగ్గించండి.. అప్పుడు అన్ని ధరలు తగ్గుతాయి: కెటిఆర్

(మొదటి పేజి తరువాయి)

పూర్తిగా ఎత్తివేసి మీ చిత్తశుద్ధి నిరూపించుకోండి. చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి. అన్ని జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి. విద్యకు సంబంధిత ఫీజులపై విధించే జీఎస్టీని పూర్తిగా తొలగించాలి. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మందులు, ప్రాణాలు కాపాడే జీవనావశ్యక ఔషధాలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి" అని కెటిఆర్ లేఖలో పేర్కొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీర

● జలదిగ్బంధంలోనే ఏడుపాయల

**మెదక్,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):**సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మంజీరా ఉగ్రరూపం దాల్చింది. వన దుర్గ ఆనకట్టకు 69,000 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో ఏడుపాయల పుణ్యక్షేత్రం ఆరు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. గర్భగుడినీ మంజీరా ముంచెత్తింది. రాజగోపురంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు- చేసి అమ్మవారి దర్శనాన్ని కల్పిస్తున్నారు. మంజీరా పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్‌ఎ÷-లో 39,009 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఎలో 43,466 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థం 29.917 టీ-ఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.534 టీఎంసీలుగా నమోదైంది.

# ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచడమే లక్ష్యం

### ప్రధాని మోదీతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కీలక సమావేశం

**న్యూఢిల్లీ,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):**భారత్, చైనా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల సడలింపు దిశగా కీలక ముందడుగు పడింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, వివాదాస్పద అంశాలను సామరస్యంగా పరిష్కరించుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన వాంగ్ యీ, తన పర్యటనలో భాగంగా ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్-చైనా సరిహద్దు సమస్యపై 24వ విడత ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు కూడా జరిగాయి. ఈ చర్చల్లో సరిహద్దు వాణిజ్యం, నదీ జలాల సమాచార మార్పిడి, కనెక్టివిటీ, వాణిజ్య సంబంధాలు, యాత్రికులకు సౌకర్యాలు వంటి పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.అంతకుముందు వాంగ్ యీ, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కూడా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో రేర్ ఎర్త్, ఎరువులు, టన్నెల్-బోరింగ్ యంత్రాలకు సంబంధించి భారత్ వ్యక్తం చేసిన మూడు ప్రధాన ఆందోళనలపై సానుకూలంగా స్పందిస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని వాంగ్ యీ హామీ ఇచ్చినట్లు సమాచారం.

జైశంకర్ మాట్లాడుతూ, "రెండు దేశాల మధ్య అభిప్రాయ భేదాలు వివాదాలుగా మారకూడదు, అలాగే పోటీతత్వం సంఘర్షణకు దారితీయకూడదు," అని స్పష్టం చేశారు. ఈ పర్యటన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి ఒక మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు.ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు చైనాలోని తియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశం జరగనున్న నేపథ్యంలో వాంగ్ యీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

# బెట్టింగ్ యాప్‌లకు అడ్డుకట్ట

### ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు కేబినేట్ ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):**ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకురాబోతోంది. దీనికి ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేసినట్లు- సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం డిల్లీలో కేంద్ర కేబినెట్ భేటీ- అయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. భేటీ- అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఆన్ లైన్ బెట్టింగ్‌ను ఇకపై తీవ్ర నేరంగా పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయి ంచింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వేదికగా బెట్టింగ్‌కు పాల్ప డితే శిక్ష తప్పదని, భారీ జరిమానాలు విధించే విధంగా ఆన్ లైన్ గేమింగ్ బిల్లును రూపొందించినట్లు- కేంద్రం తెలిపింది. ఇకపై ఆన్ లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై కేంద్ర మే నేరుగా నిఘా పెట్టనుంది. ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్స్ ఆగడాలకు మన దేశంలో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. చేపకు గాలం వేసినట్టు- కొత్త కస్టమర్లకు మొదట్లో రూ. వందకు రూ. రెండొందలు.. రూ. వెయ్యికి రెండు వేలు, మూడు వేలు ఇస్తూ మెల్లిగా ఊబిలోకి లాగుతున్నారు. ఈజీ మనీ కోసం అత్యాశతో కొందరు, వ్యసనాల బారిన పడి ఇంకొందరు.. పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలు మునిగి తేలుతున్నారు. గతంలో ఈ వ్యసనం కొంతమంది యువత వరకే పరిమితమవగా..ఇప్పుడది ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, బ్యాంకర్లు..అనే తేడా లేకుండా ప్రతి రంగానికి చేరింది. ప్రతి వంద మందిలో దాదాపు 95 శాతం మంది చేతులు కాల్చుకుని, ఆర్థికంగా చితికిపోతు న్నారు. డబ్బుల కోసం కొందరు అడ్డదారి తొక్కుతుం డగా..అవమానంగా భావించేవారు తమ ప్రాణాలతోపాటు కుటుంబ సభ్యుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకపై ఈ ఆన్ లైన్ బెట్టింగ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఆన్ లైన్ గేమింగ్ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఏదైనా పెద్ద ఘటన.. లేదంటే కుటుంబ సభ్యులు వీటి బారినపడి బలైన చోట మాత్రమే ఫిర్యాదు ఆధారంగా పోలీసులు స్పందిస్తున్నారు. లేదంటే ఇది తమ పనికాదన్నట్టు- లైట్ తీసుకుంటు-న్నారనే విమర్శలున్నాయి. పలువురు సినీ, క్రీడా ప్రముఖులు ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ యాప్స్‌పై నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్స్‌పై చర్యలకు కేంద్రం సిద్ధమైనట్లు- తెలుస్తోంది. ఇకపోతే రాజస్థాన్‌లోని కోటా- బుందిలో రూ.1507 కోట్లతో కొత్త విమానాశ్రయ నిర్మాణానికి కేబినేట్ ఆమోదం తెలిపింది. రూ.8307.74 కోట్లతో హైబ్రిడ్ యాన్యుటీ- మోడ్‌లో భువనేశ్వర్ బైపాస్ నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.రాజస్థాన్‌లోని కోటా-బురిడీలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోటా ఎయిర్‌పోర్ట్‌కు 440.06 హెక్టార్ల భూమి, రూ.1507 కోట్ల మంజూరుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అలాగే.. ఒడిశాలో కటక్-భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. రూ.8307 కోట్ల వ్యయంతో భువనేశ్వర్ రింగ్‌రోడ్డు నిర్మాణాం చేపట్టానున్నారు. కోట-బుండి గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని రూ.1507.00 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయడానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ- ఆఫ్ ఇండియా చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించిం దని తెలిపారు.

# విద్యా ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు

(మొదటి పేజి తరువాయి)

ప్రత్యామ్నాయంగా తెలంగాణలోని ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు రాంచందర్ రావు. రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ చేస్తున్నారని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పాలన వైపు చూస్తున్నారని వెల్లడించారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాంచందర్ రావు దిశానిర్దేశర చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రం యూరియా ఇవ్వడం లేదు అని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని.. రైతుల ఇబ్బందులకు నిజమైన కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు.మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా సరిగ్గా జరగడం లేదని... ఎరువుల దుకాణాల్లో యూరియా దొరక్కపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సిగ్గుచేటని అన్నారు రామచందర్ రావు.రాబోయే రోజుల్లో ఏ శక్తి అడ్డొచ్చినా, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వికారాబాద్ జిల్లా పేరును అనంతగిరి జిల్లాగా మారుస్తామని.. అనంతగిరి పర్యాటక కేంద్రంగా దక్షిణ ఊటీగా ప్రసిద్ధి చెందిందని, అనంత పద్మనాభస్వామి ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో వికారాబాద్‌లో బీజేపీ మూడు అసెంబ్లీ స్థానాలు గెలుస్తుందని అన్నారు రామచందర్ రావు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీని గెలిపించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రజలు ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని చూస్తున్నారని.. గత బీఆర్ఎస్,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఒకే తీరుగా పాలనలో వైఫల్యం చెందాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ దళితబంధు, రైతుబంధు అంటూ మాయమాటలు చెప్పి, సరిగ్గా అమలు చేయక మోసం చేసిందని... అందుకే ప్రజలు వారిని ఇంటికి పంపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా కింద ప్రతి రైతుకి 15 వేలు ఆర్థిక సాయం ఇస్తామని హామీ ఇచ్చింది కానీ.. వాస్తవానికి రెండు విడతల్లో కేవలం రూ.6 వేలు మాత్రమే ఇచ్చారని.. ఇది రైతులను మోసం చేయడమేనని అన్నారు. వికారాబాద్‌లో రాబోయే మున్సిపాలిటీ- ఎన్నికల్లో కూడా బీజేపీ గెలుపు ఖాయమని.. విద్యావంతులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాన్ని గుర్తించారని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం ఇప్పటికే 12 లక్షల కోట్లను కేటాయించిందని.. తెలంగాణ అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ సర్కారు అవసరమని అన్నారు.ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజల ఇళ్లకు వెళ్లి కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులు వివరించాలని అన్నారు.

# భవిష్యత్ అంతా హార్టికల్చర్‌దే

### శ్రమిస్తే ఐటి రంగంకన్నా మిన్నగా ఉద్యోగాలు

### వ్యవసాయశాఖమంత్రి పొంగులేటి



**హైదరాబాద్,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీలో అక్షయ డైనింగ్ హాలును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. భారతదేశంలోనే అన్ని సౌకర్యాలతో హార్టికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు- చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. మిగతా అన్ని రంగాల కంటే వ్యవసాయరంగానికే అత్యంత ప్రాధాన్యం ఉంది. భవిష్యత్తు అంతా వ్యవసాయానిదే. గత 4 సంవత్సరాల క్రితం కరోనా సమయంలో అన్ని వ్యవస్థలు మూతపడినా, నాగలి ఆగలేదు. రైతు శ్రమ ఆగలేదు. ఇంకా ఎక్కువ మొత్తంలో దిగుబడులు సాధించడం జరిగింది. హార్టికల్చర్ విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉటుందని, విద్యార్థులుగా ప్రావీణ్యతను పెంచుకుంటే, సాఫ్ట్ వేర్ ఉద్యోగుల కన్నా, మీకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు మొత్తం కోర్సులో సగానికి కన్నా ఎక్కువ రోజులు పొలాల్లో ఉండి, వ్యవసాయంలో ప్రావీణ్యం సంపాదించుకోవాలని, రైతు చేసే వ్యవసాయ విధానాలను పరిశీలించాలని తెలిపారు. హార్టికల్చర్ పంటలను అభివృద్ధి చేస్తే, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, దేశంలో లక్ష కోట్లతో పామాయిల్ దిగుమతి చేసుకోవడం జరుగుతుందని, పామాయిల్ దిగుమతి తగ్గించాలంటే, ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న 13 లక్షల ఎకరాలలో ఉన్న పామాయిల్ పంటను 70 లక్షల ఎకరాలకి విస్తరించినట్లయితే, డిమాండ్ ను అధిగమించడానికి అవకాశం ఉంటు-ందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.65 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడం జరుగుతుందని, ఆయిల్ పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలోఉందని, రానున్న 4 సంవత్సరాలలో రాష్ట్రంలో పామాయిల్ పంటను 10 లక్షల ఎకరాలకు రాష్ట్రంలో విస్తరించడానికి ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. కూరగాయలు, పండ్ల తోటలతో పాటు-గా జాజి, వక్క, మెకడమియా లాంటి అన్ని పంటలను పండించడానికి తెలంగాణ నేలలు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. భవిష్యత్తు అంతా హార్టికల్చర్ దే అని నేను భావిస్తున్నానని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడానికి ఉద్యానపంటలు ఒక గ్రోత్ ఇంజన్ గా నిలుస్తున్నాయని మంత్రిగారు పేర్కొన్నారు. హార్టికల్చర్ శాస్త్రవేత్తలు, రైతులు హార్టికల్చర్ పంటలు సాగుచేయడానికి అవసరమైన పరిశోధనలను విస్తృతం చేసి, సూచనలు సలహాలు అందించాలని మంత్రిగారు పేర్కొన్నారు. యూనివర్సిటీ-లో పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక బోధన విషయాలలో పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రిగారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకమిషన్ చైర్మన్ శ్రీ కోదండ రెడ్డి గారు, వైస్ చాన్స్ లర్ రాజిరెడ్డి గారు, వ్యవసాయశాఖ సెక్రటరి శ్రీ రఘునందన్ రావు గారు, వ్యవసాయ కమిషన్ సభ్యులు మరియు యూనివర్సిటి ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# సాండ్ బజార్ ఏర్పాటుతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులకెంతో ప్రయోజనం







**● ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ధరలో సాండ్ బజార్ లో ఇసుక లభ్యం ● హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**హన్మకొండ ఆగస్టు 19(పిసిడబ్ల్యు న్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో సాండ్ బజార్‌ను ఏర్పాటు చేసిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండ లం ఉనికిచర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండి సి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, టిజిఎండిసి అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులకు సాండ్ బజార్ లో నాణ్య మైన ఇసుకను అందుబా టులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సాండ్ బజార్ లో అందు బాటులో ఉన్న నాణ్యమైన ఇసుకను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. టీజీఎండిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాండ్ బజార్ లో వినియోగదారులకు సరిపడే విధంగా ఇసుక నిల్వలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఇసుక కోసం వచ్చే లబ్ధిదారులకు సిబ్బంది ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. సాండ్ బజార్ లో లభించే ఇసుకను తీసుకోవడానికి ఆన్లైన్లో బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, ఆన్లైన్లో బుక్ చేసుకోవడం రాని వారికి సిబ్బందినే ఆన్లైన్లో ఇసుక బుకింగ్ చేసి అందించాల న్నారు. గ్రామాలలో ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతు న్నందున ఆయా గ్రామాలలో ఇసుక అవసరాలను గుర్తించి ఆయా గ్రామాల వద్దకే ఇసుకను తీసుకెళ్లడానికి ఉన్న మార్గాలను చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఎంతో సహకారం అంది స్తుందని అన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గం లో 80% ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ అయిందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఇది అత్యధికమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు తక్కువ ధరలో లబ్ధిదారులకు ఇసుక అందించడమే లక్ష్యంగా సాండ్ బజార్ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు లకు తక్కువ రేట్ లో సాండ్ బజార్ లో ఇసుక లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాణ్యమైన ఇసుకను అందించే సాండ్ బజార్ ఏర్పాటుతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడు తూ ఉనికిచర్ల వద్ద రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్లో నాణ్యమైన ఇసుక తక్కువ ధరలో అందుబాటులో ఉంటుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. టీజీఎండిసి అధికారులు మాట్లాడుతూ టీజీఎండిసి పోర్టల్ ద్వారా, లేదా మీసేవ కేంద్రాల ద్వారా, ఆన్లైన్లో ఇసుకను బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎండిసి నోడల్ అధికారి శ్రీనివాస్, పిడి హౌసింగ్ సిద్ధార్థ నాయక్, హనుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి ప్రాజెక్ట్ అధికారులు విష్ణువర్ధన్, వినయ్, రాజు, స్థానిక తహసిల్దార్ సదానందం, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.


# రేగొండ నూతన ఎస్సైగా కే రాజేష్ బాధ్యతలు.

**● భూపాల్ పల్లివి ఆర్‌కు బదిలీ అయిన సందీప్ కుమార్**




**రేగొండ,ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** రేగొండ మండల నూతన ఎస్సైగా కే రాజేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేసిన సందీప్ కుమార్ భూపాల్ పల్లి వి ఆర్ కు బదిలీ అయ్యారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐగా విధులు నిర్వహించిన కే రాజేష్ బదిలీపై రేగొండకు వచ్చారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ కారే ఆదేశాల మేరకు మంగళవారం రేగొండలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పనిచేస్తానని అన్నారు. ప్రజలు తనకు సహకరించాలని కోరారు. నేరాల నియంత్రణలో ఎవరిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

# గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్న వేముల రమేష్




**హనుమకొండ,ఆగస్టు 19 (పిసిడబ్ల్యూన్యూస్):** ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్డీ పూర్తి చేసిన వేముల.రమేష్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్.వి.నారాయణన్ చేతుల మీదుగా పిహెచ్డి పట్టా అందుకున్నారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఉస్మానియా యూనివర్సిటీ 84 వ స్నాతకోత్సవం నిర్వహించిన కార్యక్రమంలో పిహెచ్డి పూర్తి చేసిన వేముల రమేష్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , ఇస్రో చైర్మన్ డాక్టర్.వి.నారాయణన్ లు పిహెచ్డి పట్టా అందించారు. వేముల రమేష్ మాట్లాడుతూ తను ఈ పట్టా అందుకునేందుకు సహకరించిన గైడ్ డాక్టర్. శ్రీనివాస్ రావు , తనకు సపోర్ట్‌గా నిలిచిన కుటుంబ సభ్యులకు,మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**





**హన్మకొండ ఆగస్టు 19(పిసిడబ్ల్యు న్యూస్):** సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధి కారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.మంగళవారం హనుమ కొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసేవల నిమిత్తం ప్రతి రోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంతమంది వస్తుంటారని కలెక్టర్ అడిగి తెలుసుకుని ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జ్వరాల కేసుల నమోదు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు, ఏయే వ్యాధులకు సంబంధించిన రిపోర్టులను ఏ విధంగా తెప్పించుకుంటున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి కావాల్సిన మందుల ఇండెంట్ ను సంబంధిత పోర్టల్ లో ఏ విధంగా నమోదు చేస్తున్నారని కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వను పరిశీలించారు. అదేవిధంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారని, హై రిస్క్ గ్రూపుల వారికి స్క్రీనింగ్ పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నారని వైద్యాధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టీవీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 820 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశామని, ఇందులో 84 మందికి ఎక్స్రే పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి డాక్టర్ అరుణ దేవి కలెక్టర్కు తెలియజేశా రు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హై రిస్క్ గ్రూపుల వారికి స్క్రీనింగ్ పరీక్షలు ఎక్కువగా నిర్వ హించాలని సూచించారు. ప్రణాళిక మేరకు ఎక్కువ సంఖ్యలో స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. గ్రామాలలో జ్వర సర్వే ను నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన ఇప్పించాలని కలెక్టర్ సూచించారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూభారతి దరకాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్**



**హన్మకొండ ఆగస్టు 19(పిసిడబ్ల్యు న్యూస్):** భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారుల ను ఆదేశించారు. మంగళ వారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల రికార్డులను తనిఖీ చేశారు. మండల పరిధి లోని రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహిం చిన సదస్సులలో భూ సమస్యల కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారిగా త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సదానందం, నాయబ్ తహసిల్దార్ సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎరువుల కోసం రైతులకు ఇబ్బందులు రానీయవద్దు








**ధర్మసాగర్‌లోని పిఎసిఎస్ గోదాం, మన గ్రోమోర్ కేంద్రం వద్ద ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**హన్మకొండ ఆగస్టు 19(పిసిడబ్ల్యు న్యూస్):** వ్యవసాయ సాగులో కావాల్సిన విత్తనాలు, యూరియా సహా ఇతర ఎరువులు, పురుగు మందుల కోసం పిఎసిఎస్, గ్రోమోర్ కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా తగిన చర్యలు తీసుకోవాల ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులు, నిర్వాహకుల ను ఆదేశించారు.మంగళవారం హనుమ కొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువులు పురుగు మందులు విత్తనాల గోదాం, మన గ్రోమోర్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్ద యూరియా, ఇతర ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ ప్రక్రియను కలెక్టర్ దాదాపు నలభై నిమిషాల పాటు అక్కడే ఉండి పరిశీలించారు. పలు ఆధారాలతో యూరియా తోపాటు ఇతర ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం వచ్చిన రైతుల వివరాలను బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. పిఎసిఎస్, మన గ్రోమోర్ కేంద్రాలలో సరిపోను యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలు ఉన్నాయా లేదా అని అధికారులు, నిర్వాహకుల ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బయోమెట్రిక్ విధానంలో రైతుల వివరాలను త్వరగా నమోదు చేసి రైతులకు కావలసిన యూరియా సహా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందించాల న్నారు. బయోమెట్రిక్ సిగ్నల్స్ లేవనే కారణంగా రైతులకు ఇబ్బందులు రానీయవద్దని, బయో మెట్రిక్ సిగ్నల్స్ బాగుండే విధంగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. యూరియా సరఫరా సక్రమంగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా కొరత రానీయకుండా వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు కలెక్టర్ తో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, తహసిల్దార్ సదానందం, మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం నా ప్రాణాలను కాపాడింది



**చిట్యాల, ఆగస్టు19, (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రం సమీప వెంకట్రావుపల్లి (సి) గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగితే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్న రోగిని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్ర గుర్రపు రాజమౌళి పేషంటు ను కలిసి వివరాలు సేకరించారు. వెంకట్రావుపల్లి (సి)గ్రామానికి చెందిన రంపిస లింగాభాయి(84) అను మహిళ వృద్ధురాలు ప్రమాదవశాత్తు ఈనెల 10న తమ ఇంటి సమీపంలో కాలుజారి కింద పడగా ఆమెకు ఎడమ కాలు విరిగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను పరకాల పట్టణంలోని ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పటల్ ఐనా సుశ్రుత హాస్పిటల్ కి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి తెల్ల రేషన్ కార్డు ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆమెకు ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా పేషంట్ లింగాభాయి మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం నా ప్రాణాలను కాపాడిందని ఆపరేషన్ కోసం హాస్పటల్ వారు నావద్ద చిల్లిగవ్వ కూడా తీసుకోకుండా ఉచితంగా ఆపరేషన్ చేసి నాణ్యమైన వైద్యం అందించి ఉచిత భోజనం వసతి రవాణా చార్జీలు మెడిసిన్ అందించి తనను ఇంటికి చేర్పించారని ఆమె తెలిపారు.నా ప్రాణాలను కాపాడిన రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఆగస్టు 22న జాబ్ మేళా నిర్వహణ

**- పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు**

**పెద్దపల్లి, ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్ లోని మెడ్ ప్లస్ లో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 22న మంగళవారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్లో రూమ్ నెంబర్ 225 నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్ ప్లస్ సంస్థలో 120 పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని, 40 ఫార్మసిస్ట్, 20 కస్టం సేల్స్ అసోసియేట్, 30 స్టాక్ పిక్కింగ్ , ప్యాకింగ్ అసిస్టెంట్, 30 ఆడిట్ అసిస్టెంట్ పోస్ట్ లు ఖాళీలు ఉన్నాయని, ఫార్మసిస్ట్ పోస్టులకు డిప్లొమా/ డిగ్రీ ఇన్ ఫార్మసీ, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ అసిస్టెంట్లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 18 నుంచి 30 లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 22 న ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో సమీకృత జిల్లా కలెక్టరేట్ కు వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9392310323, 8985336947, 8121262441 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## పాఠశాలల్లో మెనూ పాటించాలి...

**- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి: కలెక్టర్ పమేలా సత్పతి...**





**కరీంనగర్ రూరల్,ఆగస్టు19(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం చింతకుంట పరిధి శాంతినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు తిరుగుతూ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్నం భోజనం, బోధన మెటీరియల్, రీడింగ్ కార్నర్ ను పరిశీలించారు. పాఠశాలలో టీవీ పని చేస్తుందా. ఉపాధ్యాయులు ఏం చెబుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అదనపు తరగతి గదుల కోసం భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.వారి వెంట ఎంఈఓ ఆనందం, హెచ్ఎం గౌస్ ఖాన్ తదితరులు ఉన్నారు.

## కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో ఫోటోగ్రాఫర్లకు సన్మానం...





**కరీంనగర్,ఆగస్టు19(పీసీడబ్ల్యూ న్యూస్):** 186 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా మంగళవారం రోజున పలువురు సీనియర్ ఫోటో జర్నలిస్ట్ లను ఫ్రెండ్స్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఫ్రెండ్స్ కల్చరర్ అకాడమీ అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ మాట్లాడుతూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఫోటోలు సందర్భాన్ని బట్టి కళాత్మకంగా బంధించచడం అంత సులభం కాదన్నారు. ఫొటోలు ఓ తీయని మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయన్నారు. మన గతాన్ని, అందుకు సంబంధించిన జ్ఞాపకాలను గుర్తు కు తీసుకువచ్చే ఏకైక ఆధారం ఫోటో చిత్రలేనన్నారు. కళాత్మక నైపుణ్యం క్షణాల్లో ఆలోచించే విధంగా ఫోటోలు ఉంటే,ఆ ఫోటోలు చిరస్థాయిలో నిలిచిపోతాయని,అవే మన ్ఞపకాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు బండి సంపత్ కుమార్, శానగోండ వాసు, బండ రమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ అనుప్, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీటి నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

**● ఎల్లంపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్**

**● ప్రస్తుత నీటి నిల్వ, ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో తదితర అంశాల పై ఆరా**





**పెద్దపల్లి అంతర్గాం, ఆగస్టు -19 (పిసిడబ్ల్యూన్యూస్):** ఎల్లంపల్లి రిజర్వాయర్ లో నీటి నిర్వహణ పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అంతర్గాం లోని ఎల్లంపల్లి రిజర్వాయర్ ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి రిజర్వాయర్ లో ఉన్న నీటి నిల్వ ఎంత ఉంది? ఇన్ ఫ్లో ఎంత ఉంది? ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం ఎంత? వంటి వివరాలను నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఆరా తీశారు. ప్రస్తుతం 35 గేట్ల ద్వారా ఎల్లంపల్లి నుంచి దిగువకు వరద విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టు నుంచి భారీ ఎత్తున వరద వస్తున్నందున ఎల్లంపల్లి దిగువకు నీరు విడుదల చేస్తున్నామని, ప్రాజెక్టు దిగువన గోదావరి నది పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు, చేపలు పట్టేవారు రైతులు సామాన్య ప్రజలు నది దాటే ప్రయత్నం చేయవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద ఆధారంగా ఎప్పటికప్పుడు దిగువకు నీరు విడుదల చేయాలని కలెక్టర్ సూచించారు. డ్యాం గేట్లను పరిశీలించి వాటి నిర్వహణను పర్యవేక్షించారు. నీటి విడుదల అంశాలు రెగ్యులర్ గా ప్రెస్ కు విడుదల చేయాలని కలెక్టర్ ప్రాజెక్ట్ అధికారులకు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటిమట్టం అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి రామగుండం మండలం లోని ముంపు ప్రాంతం మల్కాపూర్ గ్రామంలో పర్యటించి లోతట్టు ప్రాంతాలలో నీరు ఒకే చోట నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సీఈ సుధాకర్ రెడ్డి, ఎస్.ఈ. సత్యనారాయణ, డీఈ బుచ్చి బాబు, శరత్ బాబు,తహసిల్దార్ ఈశ్వర్, ఈ ఈ రామన్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# పనులు వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తిచేయండి...

**● నాణ్యత విషయంలో రాజీపడొద్దు**

**● ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఐడిఎస్ఎంటిని పరిశీలించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**





**కరీంనగర్,ఆగస్టు19(పీసీడబ్ల్యూ న్యూస్):** ఐడిసిఎంటి పనులు వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయానికి పనులు పూర్తిచేయాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆదేశించారు.ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఐడిసిఎంటిని పరిశీలించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చెత్త చెదారంతో మురికి కూపంగా మారిన ఐడిసిఏంటికి మౌలిక సదుపాయాలు కల్పించి ఆధునీకరించి ప్రజలకు ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో నిధులు కేటాయించడం జరిగిందని టవర్ సర్కిల్ ప్రాంతంలో పార్కింగ్ స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పదిహేను సంవత్సరాల క్రితం నిర్మించిన ఐడిసిఎంటి భవనం ఉపయోగంలేకుండా పోయిందని అందుకే దాన్ని 79 లక్షలతో ఆధునీకరించి పార్కింగ్ తో పాటు షట్టర్స్ ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.నాణ్యత విషయంలోగాని నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి చేయడంలోగానీ ఎక్కడా రాజీపడకుండా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఇంజరింగ్ అధికారులలో ఈఈ రొడ్డ యాదగిరి,డిప్యూటీ ఈఈ రాజేంద్ర ప్రసాద్,ఎఈ సతీష్,అజ్మల్ తదితరులు ఉన్నారు.

# జీలకుంట వాసి ఇరుకుల వీరేశంకు ఫోటోగ్రఫీలో అవార్డుల పంట

**● రైతు భరోసా, యువ వికాసం ఫోటోలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు**

**● ఫోటోగ్రఫీలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఇరుకుల్ల వీరేశం**




**పెద్దపల్లి జిల్లా.ఓదెల: ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఒక యువకుడిలో సరదాగా ప్రారంభమైన ఫోటోగ్రఫీ హాబి సొంత నైపుణ్యంతో ప్రొఫెషనల్ గా మారి జీవనాధారంగా నిలిచింది. ఓదెల మండలం జీలకుంట గ్రామానికి చెందిన ఇరుకుల్ల వీరేశం ఫోటోగ్రఫీని హాబీగా ప్రారంభించి స్వంత నైపుణ్యంతో అనేక సుందర ఛాయాచిత్రాలను సృష్టించి వివిధ్ ఫోటోగ్రఫీ పోటీలకు పంపించి ఎన్నో అవార్డులను గెలుచుకున్నాడు. అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డులను సైతం కైవసం చేసుకున్నారు.2022 లో ఎన్ ప్రింట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ (ప్రింట్ అండ్ డిజిటల్) వారు అంతర్జాతీయంగా ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించగా ఇందులో 27 దేశాలు పాల్గొన్నాయి. భారతదేశం తరపున ఈ పోటీలో ఆన్ లైన్ లో పాల్గొన్న ఇరుకుల్ల వీరేశం అంతర్జాతీయ ఫోటోగ్రఫీ పోటీలలో ప్రింట్ కలర్ విభాగంలో 8 అవార్డులను సాధించారు. 2016 సంవత్సరం నుండి ప్రతి ఏటా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏదో ఒక అవార్డును సాధించారు.ఫోటోగ్రఫీని ప్రాణంగా భావించే వీరేశం, గిరిజనుల అందాలను చిత్రీకరించడానికి అరకులోయ, ఒడిస్సా, వినాయక నిమజ్జనం దృశ్యాల కోసం మహారాష్ట్ర, హిమాలయాల సౌందర్యం ఒడిసి పట్టడానికి జమ్మూ కాశ్మీర్ లాంటి వైవిధ్య భరితమైన ఎన్నో ప్రాంతాలను సొంత డబ్బులు వెచ్చించి అత్యంత వ్యయ ప్రయాసల కోర్చి పర్యటించారు. అక్కడి అందాలను తన కెమెరాల్లో బంధించి ఎన్నో విలువైన ఛాయాచిత్రాలను ఆవిష్కరించారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఐ అండ్ పిఆర్ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఇరుకుల్ల వీరేశం కు కేటగిరి రాజీవ్ యువ వికాసంలో తృతీయ బహుమతి మరియు కేటగిరి రైతు భరోసా లో కన్సోలేషన్ బహుమతి లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పలు సంక్షేమ పథకాల పైన తీసిన ఛాయా చిత్రాలకు గాను పోటీ నిర్వహించగా అందులో రాజీవ్ యువ వికాసం ఫోటోకు తృథియ బహుమతి , రైతు భరోసా ఫోటోలు ఎంపిక చేశారు. ఈ బహుమతిని మంగళవారం హైదరాబాదులోని గ్రీన్లాండ్స్ గ్రీన్ పార్క్ హొటల్ లో సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సమాచార, పౌర సంబంధాల కమిషనర్ సిహెచ్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా వీరేశం అవార్డు అందుకున్నారు. గ్రామీణ నేపథ్యం కలిగిన వీరేశం.. సునిశిత దృష్టితో ప్రకృతి అందాలు, గిరిజన జీవితాలు, సంస్కృతి సంప్రదాయాలు పరిశీలించి తన కెమెరాలతో బంధించి చూపర్లను సమ్మోహిత పరుస్తున్నాడు.అతని ప్రతిభకు లభిస్తున్న పురస్కారాల పట్ల ఫోటోగ్రఫీ అభిమానులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు

# ఘనంగా కొండా సురేఖ జన్మదిన వేడుకలు...

**● దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు. ● బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి. ● పేదల పెన్నిధి మన ప్రియతమ నాయకురాలు**

**● పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీకీ కొండంత అండ...**



**ఇల్లంతకుంట,ఆగస్టు19(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. దేవస్థాన చైర్మెన్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండల కేంద్రం లో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం లో అర్చన, పూజ కార్యక్రమాలు చేసిన తర్వాత కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా దేవస్థాన చైర్మెన్ మాట్లాడుతు కొండాసురేఖ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని ప్రజా సేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ప్రజా పాలనలో ప్రజలకు సేవ చేసేభాగ్యం కల్పించాలని ఆ దేవుణ్ణి కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, పజిల్ రెహమాన్, రమేష్, తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్,సతీష్, లింగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘురాం రెడ్డి, ఇతర సభ్యుల నిరసనలతో.. తెలంగాణకు యూరియా కేటాయింపులపై కేంద్రంలో కదలిక

**వెంటనే 62 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందజేస్తామని ప్రకటన**

**కేంద్ర ఎరువుల శాఖ మంత్రి నడ్డాను కలిసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, ఇతర సభ్యులు**

**ఢిల్లీ ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రానికి యూరియా నిల్వల సరఫరాలో అన్యాయం జరుగుతోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఇతర తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణ వద్ద కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రాతో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమం, గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తులతో కేంద్ర ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఈ క్రమంలో తాజాగా.. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఇతర సభ్యులు కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ. నడ్డాను కలిసి.. తెలంగాణలో ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్న తీరును వివరించగా.. స్పందించి 62,000 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందులో 14 వేల మెట్రిక్ టన్నులు వెంటనే పంపించామని.. ఒకటి రెండ్రో జుల్లో తెలంగాణకు చేరుతాయని, ఆ తర్వాత మిగతా నిల్వలు పంపిస్తామని స్పష్టం చేశారు.



# మృతుడి కుటుంబానికి సిఐ మల్లేష్ పరామర్శ




**చిట్యాల,ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాలలో బుర్ర రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం చిట్యాల సిఐ దగ్గు మల్లేష్, మృతుని కుమారులు, చక్రపాణి (ఆంధ్రప్రభ రిపోర్టర్), దేవేందర్ (హెూంగార్డ్,) కుటుంబ సభ్యులు పరామర్శించారు , మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బుర్ర రఘు, నాగరాజు, పాల్గొన్నారు.

# ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి**





**హన్మకొండ ఆగస్టు 19(పిసిడబ్ల్యు న్యూస్):** ఆర్డిఓ ల పరిధి లోని వివిధ మండలాల తహసీల్దార్ల వద్ద పెండింగ్ కేసుల వివరాలు మరియు పెండెన్సికి గల కారణాల పై సమీక్ష నిర్వహించి వారం రోజుల్లో భూభారతి దరఖాస్తుల పరిష్కారం ను పూర్తి చేయాలని, పరిష్క రించలేని దరఖాస్తుల వివరాల నివేదికలను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత మండలాల తాసిల్దార్లకుసూచించారు. రెవెన్యూ రికార్డుల భద్రత విషయం లో జాగ్రత్తలు వహించా ల్సిందిగా సూచించారు. మండల తహసిల్దార్ల కార్యాలయాలలో విధిగా నిర్వహించవలసిన రిజిస్టర్లను తప్పనిసరి నిర్వహించడంతో పాటు బయోమెట్రిక్ అటెండెన్స్, పర్సనల్ రిజిస్టర్, రికార్డ్ మెయింటెనెన్స్ చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత తహసీల్దా రులకు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెంట్స్ వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి ఉమారాణి, వివిధ మండలాలు తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**చిట్యాల, ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రం ఒడితల పిహెచ్సి ముందు తమ సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్స్ ధర్నా అనంతరం మెడికల్ ఆఫీసర్ మౌనికకు వినతిపత్రం అందజేశారు ఆశ వర్కర్స్ మండల అధ్యక్షురాలు రాధిక మాట్లాడుతూ ఆశా వర్కర్లకు జులై నెల పారితోషకాలు వెంటనే చెల్లించాలని ఆగస్టు నెల పారదర్శకాలు ఆలస్యం చేయకుండా గతంలో చెల్లించినట్లు సకాలంలో చెల్లించాలని ఫిక్స్ వేతనం 18000 నిర్ణయించాలి పిఎఫ్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశలకు ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని ఆరు నెలలు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని ఆశలకు పని భారం తగ్గించాలని పారితోషం లేని పనులు చేయించకూడదని ఆశలకు రక్షణ కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సుమలత.లక్ష్మి.విజయ. స్వప్న. సరోజన. కమల. రజిత.కృష్ణవేణి తదితర ఆశాలు పాల్గొన్నారు

# ఫీజు రియంబర్స్మెంట్ సంక్షోభం విద్యార్థుల జీవితాలతో ఆటలా?

- **మొత్తం డబ్బులు కట్టాల్సిందే**
- **ఫీజు రియంబర్స్ రాలేదు**
- **యజమాను ల దౌర్జన్యం**
- **స్పందించని ప్రభుత్వం**
- **విద్యార్థుల జీవితాలు అగమ్య గోచరం**
- **సర్టిఫికెట్లు ఇవ్వని విద్యాసంస్థలు**
- **సీఎం రేవంత్ రెడ్డి**
- **మా సర్టిఫికెట్స్ మాకు ఇప్పించండి.**



**హైదరాబాద్,ఆగస్టు19(పీసీడబ్ల్యూ న్యూస్):** ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ జాప్యం కారణంగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిపోయింది. ప్రభుత్వ వైఖరితో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని, మొత్తం ఫీజు కడితేనే ఇస్తామని బెదిరిస్తుండటంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.గతంలో ప్రభుత్వాలు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు అందించి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ప్రోత్సహించేవి. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యజమానులు,మొత్తం ఫీజు చెల్లించాలని తెగేసి చెప్తున్నారు.సర్టిఫికెట్లు ఇవ్వని విద్యాసంస్థలు డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు పీజీ, ఇతర ఉన్నత కోర్సులు చదవాలంటే తమ సర్టిఫికెట్లు, టీసీ తప్పనిసరి. కానీ,కళాశాలలకు వెళ్లిన విద్యార్థులకు 'డబ్బులు కడితేనే సర్టిఫికెట్లు, లేకపోతే దిక్కున్న చోట చెప్పుకోండి' అని యాజమాన్యాలు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఫీజు చెల్లించలేని పేద విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యలోనే వదిలేసి ఇళ్లకు పరిమితం అవుతున్నారు. కొందరు ఖాళీగా ఉండలేక కూలి పనులకు వెళ్తున్నారని తెలిసింది. **స్పందించని ప్రభుత్వం.. అగమ్యగోచరమైన విద్యార్థుల జీవితాలు** ఈ సమస్యపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఫీజు రియంబర్స్మెంట్ పథకం లక్ష్యం పేద విద్యార్థులకు ఉన్నత చదువులను అందుబాటులోకి తీసుకురావడమే. కానీ, బకాయిలు చెల్లించకపోవడం వల్ల అదే లక్ష్యం దెబ్బతింటోంది. విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.మేధావి వర్గం, సామాజిక కార్యకర్తలు ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని, కళాశాల యాజమాన్యాలకు బకాయిలు చెల్లించి, విద్యార్థుల సర్టిఫికెట్లను వారికి ఇప్పించాలని కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటానికి, వారు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించడానికి ఇది అత్యవసరం. సీఎం రేవంత్ రెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కారం చూపాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

# రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం...

**- యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తూ, దళారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.**

**- యూరియా కొరతపై కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది..**

**- బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్...**

**కరీంనగర్,ఆగస్టు19(పీసీడబ్ల్యూ న్యూస్):** వానాకాలం పంటలకు సాగుకు సరిపడా యూరియా అందించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ యూరియా కోసం రైతులు అర గోస పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించాల్సిన కోటా ప్రకారం సరిపడా ఎరువులను అందిస్తున్న ప్రభుత్వం రైతులకు సక్రమంగా యూరియాను సరఫరా చేయలేకపోతుందన్నారు. ముఖ్యంగా యూరియా ను కొంతమంది బ్లాక్ మార్కెట్ చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చూసి చూడనట్లుగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో యూరియాను బ్లాక్ మార్కెట్ చేసే దళారులు రెచ్చిపోతున్నారని, యూరియా విషయంలో తీవ్ర కొరతను సృష్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తు, నిలువు దోపిడి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి శతవిధ ప్రయత్నాలు చేస్తుందని ఆయన ఘాటుగా విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా యూరియా కొరత ఇక్కడ ఎందుకు ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో రామగుండం లాంటి ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించి యూరియా కొరత లేకుండా చూడడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయాన్ని ముఖ్యంగారైతులు గ్రహించాలన్నారు. యూరియా విషయంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం యూరియా విషయంలో రాజకీయాలు మానుకొని, రైతులను గోస పెట్టకుండా సరిపడా యూరియాను అన్నదాతలకు అందించడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



# భారీ వర్షాలకు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నిలిచిన వరద నీరు

- **సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి వర్షపు నీటిని తొలగింపజేసిన కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్**
- **భారీ వర్షాల నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి**
- **మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాన్ని ఆదేశించిన కార్పొరేటర్**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు సంగారెడ్డి జిల్లా పటాన్చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవడం జరిగింది.ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో వర్షపు నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కి తెలియజేయగ వెంటనే స్పందించిన కార్పొరేటర్ మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాన్ని ఆదేశించి వర్షపు నీటిని తొలగింపజేయడం జరిగింది.అనంతరం సీతారామపురం కాలనీలో నిన్నటి వర్షానికి కాలనీలోని పలు చోట్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలపగా మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బందిని పురమాయించి వర్షపు నీటిని తొలగింపజేయడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భారీ వర్షాల కురుస్తున్న కారణంగా డివిజన్ పరిధిలోని జి హెచ్ ఎమ్ సి ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మ్యాన్ హెూల్స్ పైన ఖచ్చితంగా మూతలు ఉండేలా జాగ్రత్త పడాలని అన్నారు,భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే తమకు తెలపాలని, తక్షణ చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి

- **కార్మిక చట్టాలను అమలు చేయని యజమానులను శిక్షించాలి**
- **వలస కార్మికులను దోచుకోవడం చేయడం మానేయాలి**
- **కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఉద్యమం: సిఐటియు నేత కే రాజయ్య**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలోని కాజిపల్లిలో సిఐటియు కార్యకర్తల సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా సిఐటియు సంగారెడ్డి జిల్లా కోశాధికారి కే రాజయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలన్నీ యజమానులు అమలు చేయాలని,అమలు చేయని యజమానుల ను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.కాజిపల్లి, బొల్లారం,గడ్డపోతారం, బొంతపల్లి తదితర పారిశ్రామిక వాడలోని పరిశ్రమలలో కనీస వేతనాలను అమలు చేయట్లేదు అని ఆయన అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ జీవోలను ఏ ఒక్క కంపెనీ కూడా అమలు చేయడం లేదని ఆయన అన్నారు. ప్రభుత్వ జీవోలను అమలు చేయకపోతే పరిశ్రమల వద్ద ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు, అలాగే కార్మిక చట్టాల అన్నిటిని యజమానులు తుంగలో తొక్కుతున్నారని అన్నారు,క్యాంటీన్, ట్రాన్స్పోర్ట్, సెలవులు, ఈ ఎస్ ఐ,పి ఎఫ్,యూనిఫామ్,ఓటి డబుల్, రెస్ట్ రూమ్,మంచినీళ్లు,వాష్ రూమ్లు తదితర వాటిని ఎవరు సరిగా అమలు చేయడం లేదని ఆయన అన్నారు,అనేక పరిశ్రమలలో 10 గంటలు 12 గంటలు డ్యూటీ చేయించుకుంటున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాన్ని 26 వేలకు పెంచాలని ఆయన అన్నారు, కాంటాక్ట్ కార్మికుల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, సిఐటియు నాయకులు వెంకటేశ్వరులు, శ్రీరాములు, జగన్ పాల్గొన్నారు.



# అవసరానికి మించి రైతులు యూరియాను నిల్వ పెట్టుకోవద్దు

**● ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి**

**కొరివి ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలోని రైతు వేదికలో యూరియా కొరతపై జరిగిన సమీక్షలో ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మరిపెడ డివిజన్ పరిధి లో ఇప్పటివరకు 6,400 మెట్రిక్ టన్నుల యూరియాను రైతాంగానికి అందించడం జరిగిందని, 170 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి రానుందని ఇది సొసైటీల ద్వారా రైతాంగానికి పంపిణీ చేయడం జరుగుతుందని, తొందరపడి రైతులు అవసరానికి మించి యూరియాను నిలువలు పెట్టుకోవద్దని,విడతల వారిగా రైతులకు కావలసినంత యూరియా ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ చొరవతో వ్యవసాయ శాఖ అందించడానికి కృషి చేస్తుందని, కేంద్రం నుండి రాష్ట్రానికి రావలసిన మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా త్వరితగతిన విడుదల చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది కాబట్టి రైతులు ఆందోళన చెందవద్దని కోరారు పంటలకు రెండవ విడతలో నానో యూరియాను వాడటం వల్ల అధిక దిగుబడి రావడానికి అవకాశాలు ఉంటాయని, అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువులలో కూడా యూరియా మిశ్రమం ఉంటుంది కాబట్టి నేరుగా అధిక యూరియా వాడకాన్ని రైతాంగం తగ్గించడం వల్ల భూసారం పెరిగి చీడ పీడల నుండి పంటలను రక్షించుకోవచ్చు అని కోరారు. ఈ సమీక్షలో మండల వ్యవసాయ అధికారి జి నర్సింహారావు, ఏ ఏ ఓ లు రాజేశ్వరి ,దేవ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

**● కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి ఆసుపత్రి భవనాలను ప్రారంభించండి**

**● సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ఖమ్మం, ఆగస్టు 19 (పిసి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అధికారయంత్రాంగం దీనిపై దృష్టి సారించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ప్రతి యేటా సీజనల్ వ్యాధుల బారీనపడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఇప్పటికే కొణిజర్ల మండలంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన తెలిపారు. వ్యాధులు ప్రబలుతున్న గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో తగినన్ని మందులు సరఫరా చేయడంతో పాటు సిబ్బందిని నియమించాలని అవసరమైతే అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం కావాలని సురేష్ కోరారు. పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి సహా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆసుపత్రి భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని కాంట్రాక్టర్ అప్పగించినా ప్రారంభించడం లేదని శిథిల భవనాల్లో వైద్య సేవలను అందిస్తున్నారని ఆయన తెలిపారు. తక్షణం భవనాలను ప్రారంభించాలని ఆయన కోరారు. ఎడ తెగని వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా మెట్ట పంటలు దెబ్బతిన్నాయని నదులు, వాగులు, ఏర్ల పరివాహక ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగాయని నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు పరిహారం ప్రకటించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలను రక్షించుకునేందుకు ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు అందజేయాలని ఆయన కోరారు.

# ఒకే రోజు రెండు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించిన MDR ఫౌండేషన్

**● మానవత్వమే మా ధర్మం - MDR ఫౌండేషన్**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజ సేవనే ప్రధాన కర్తవ్యంగా భావిస్తూ, యువతలో మానవతా విలువలు పెంపొందించాలనే లక్ష్యంతో MDR ఫౌండేషన్ ప్రతిరోజూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆ క్రమంలో, పటాన్చెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఒక వృద్ధురాలికి కుటుంబ సభ్యుల్లా భావించి అంత్యక్రియలు నిర్వహించగా, మరోవైపు కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న 45 సంవత్సరాల అస్సాం కు చెందిన వ్యక్తి కుటుంబం, పిల్లలు ఉన్నప్పటికీ మద్యానికి బానిసై చివరికి జీవితాన్ని నిర్లక్ష్యం చేసుకుని ఒంటరితనంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి సంబంధించిన వారు ఎవరూ ముందుకు రాకపోవడంతో, MDR ఫౌండేషన్ అతనిని కూడా తన కుటుంబ సభ్యుడిగా భావించి అంత్యక్రియలు నిర్వర్తించింది.

# సిఎమ్ఆర్ఎఫ్ నిధుల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతా



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాలు గ్రామాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.మొత్తం 67 సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులు వాటి విలువ రూ.1719000 రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.సిఎమ్ఆర్ఎఫ్ చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.మంత్రుల కంటే సీఎంఆర్ చెక్కును అందించడంలో చింత ప్రభాకర్ ముందున్నారని పార్టీ శ్రేణులు తెలిపారు. మధ్యవర్తి లేకుండా నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎమ్ఆర్ఎఫ్ చెక్కుల దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,ఫర్టిలైజర్ షాప్, పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ

**● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



**మహబూబాబాద్ జిల్లా ఆగస్టు19(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, డోర్నకల్ మండలంలో విస్తృతంగా పర్యటించారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాల, ఫర్టిలైజర్ షాప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న పిల్లలకి నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ క్లాసుల ద్వారా తరగతుల నిర్వహించాలని, ప్రతి సబ్జెక్టు వారీగా పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యా బోధనలు అందించాలన్నారు, ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని, పాఠశాల పరిసరాలు డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ మరుగుదొడ్లు తదితర ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్రమం తప్పకుండా షెడ్యూలు ప్రకారం నిత్యం సానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు. భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ ఉండాలన్నారు,పిల్లల విద్యాసామర్థ్యాలను స్వయంగా కలెక్టర్ పరిశీలించారు, జిల్లాలో యూరియా కృత్రిమ కొరత సృష్టించద్దని, అధిక ధరలకు అమ్మ వద్దని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియాను అమ్మకాలు జరపాలని, రైతులకు అందుబాటు సమయాలలో సంబంధిత ఫర్టిలైజర్ షాపులను ప్రారంభించాలని, ఆన్లైన్ విధానం ద్వారా మాత్రమే రైతు యొక్క వివరాలు పాసుబుక్ ఆధార్ కార్డు ద్వారా అమ్మకాలు జరపాలని, దుకాణంలోని ఆన్లైన్ ఓపి ఎమ్మెస్, ఫిజికల్ గోడౌన్ నిలువలు కచ్చితంగా ఉండాలన్నారు,స్వయంగా రిజిస్టర్ లను పరిశీలించి ఖచ్చితమైన సమాచారం రైతులకు చేరవేయాలని ఆరోజు స్టాక్ వివరాలు రావలసిన స్టాక్ వివరాలు అన్ని రైతులకు విషయ సూచిక ద్వారా తెలియజేయాలన్నా, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రస్తుతం రైతులు వేసుకున్న పంటలకు అనుగుణంగా ఫర్టిలైజర్స్ మందుల వినియోగం పూర్తిగా తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.వానాకాలం సీజన్ లో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించాలని, నిత్యం ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు, మందుల స్టాక్ వివరాలు సిబ్బంది హాజరు వివరాలు ఆయన పరిశీలించారు, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, సీజన్కు అనుగుణంగా వైద్య కార్యాచరణ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత సిబ్బం దిని ఆదేశించారు, జిల్లాలోని ప్రత్యేక అధికారులందరూ వారికి కేటాయించిన మండలాలలో వర్షాకాలం వరదల కారణంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకొని సిద్ధంగా ఉండా లని, ప్రతి ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ నిర్వహించి, యూరియా నిలువలను సరిచూసుకో వాల న్నారు, వసతి గృహాలు, పాఠశాలలు క్రమం తప్పకు ండా సం దర్శించాలన్నారు,ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, డోర్నకల్ తహసిల్దార్ ఇమ్మానియేల్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

# 24,25న బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం


**● తల సేమియా బాధితులకు ఆసరాగా రక్తదాన శిబిరం ● దేశవ్యాప్తంగా లక్ష యూనిట్ల సేకరణ కు శిబిరాల ఏర్పాటు ● విలేకరుల సమావేశంలో బ్రహ్మకుమారి అరుణ**




**ఖమ్మం, ఆగస్టు 19 (పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** తలసేమియా బాధితులకు అండగా నిలిచేందుకు తమవంతు కర్తవ్యంగా ఈనెల 24, 25న ఖమ్మంలో బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు రాజయోగిని బ్రహ్మకుమారి అధిపతి ఖమ్మం ఇన్చార్జి బి. కె. అరుణ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మకుమారి అరుణ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి ఆపదలో ఉన్న బాధితులకు వినియోగించేలా మానవ సేవయే మాధవ సేవగా భావించి, తమవంతు కర్తవ్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఖమ్మంలోని కస్బాబజార్ రామాలయం టెంపుల్, కెఎల్ఎమ్ షోరూం సమీపంలో ఉన్న బ్రహ్మకుమారి సంస్థ కార్యాలయంలో ఈనెల 24, 25న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు, అదేవిధంగా ఆపదలో ఉన్న పేషెంట్లకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదానం చేసే దాతలకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందించటం జరుగుతుందన్నారు. మానవత దృక్పథంతో చేసే ఈ సామాజిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బ్రహ్మకుమారి గీత, బ్రహ్మకుమారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న విషజ్వరాలు

**● పారిశుధ్యం పై దృష్టి పెట్టండి ● బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి బీజేపీ వినతిపత్రం సమర్పణ**



**ఖమ్మం, ఆగస్ట్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం జిల్లాలో విషజ్వరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వందల సంఖ్యలో జ్వర బాధితులు ఆస్పత్రులకు తరలించబడుతుండగా, గత పది రోజులలోనే 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం జిల్లావాసుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయభాయ్ కి వినతిపత్రం సమర్పించారు.వినతిపత్రంలో ఆయన జిల్లాలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను ప్రస్తావిస్తూ, భారీ వర్షాల ప్రభావంతో గ్రామాలు, పట్టణాల్లో మురుగు నీరు పేరుకుపోయి పారిశుద్ధ సమస్యలు అధికమయ్యాయని, దోమల ఉధృతి పెరగడంతో ప్రజలు విషజ్వరాలు, వైరల్ జ్వరాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో కేసులు నమోదు కావడం, పలువురి ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు.ఈ సందర్భంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ పనులను అత్యవసరంగా చేపట్టడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రే కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాల్సిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , మండల ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామాల వారీగా ప్రజలకు సేవలు అందించాలనీ, మందులు మరియు రక్తపరీక్షా సదుపాయాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు.నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ గత పది రోజుల వర్షాల కారణంగా జిల్లా అంతటా జలమునిగిన వాతావరణం ఏర్పడిందని, దాని ప్రభావం ఆరోగ్యరంగంపై తీవ్రంగా పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పరిస్థితిని గమనించి కఠిన చర్యలు తీసుకుంటే మరిన్ని ప్రాణ నష్టం జరగకుండా నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రజలు ఆందోళనలో ఉన్నప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయభాయ్ ఆధ్వర్యంలో తగిన చర్యలు త్వరితగతిన ప్రారంభమవుతాయని, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అధికారులు కృషి చేస్తారనే నమ్మకం ఉందని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.వినతి పత్రం సమర్పించిన వారిలో బిజెపి నాయకులు గంట్యాల విద్యాసాగర్ ,అల్లిక అంజయ్య, నల్లగట్టు ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# యాదవ సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ లో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న యాదవ సంఘం కళ్యాణ మండపం పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరితగతిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం ఫాల్ సీలింగ్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. పనులు త్వరితగదన పూర్తి చేయాలని జిహెచ్ఎంసి ఏఈ శివకుమార్ ను ఆదేశించారు.



# బట్టికుంట చెరువును సందర్శించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):**మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ లోని బట్టికుంట చెరువు కట్ట గత మూడు, నాలుగు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు సోమవారం రాత్రి తెగిపోయినా విషయం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మంగళవారం సందర్శించారు.బట్టికుంట చెరువును, ఆ చెరువు వలన ధ్వంసం అయిన రోడ్డును, మునిగిపోయిన పంట పొలాలను పరిశీలించారు.ఇరిగేషన్ అధికారులు ముందస్తు చర్యలు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు,స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని తెలియజేశారు.వెంటనే ప్రభుత్వం అధికారులు పర్యవేక్షించి చెరువు కుంటని, ధ్వంసం అయిన రోడ్డు ను మరమత్తులు చేయాలని అలాగే పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నర్సింలు మండల నాయకులు అంజి యాదవ్ ,దశరథ్,సూర్యకుమార్,మోహన్ రాథోడ్,రవి,లతీఫ్, నర్సాప్ప,కాజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం



**హన్మకొండ ఆగస్టు 19(పిసిడబ్ల్యు న్యూస్):** మంగళవారం హసన్ పర్తి మండలం లోని బైరన్ పల్లి గ్రామం లో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు టైలరింగ్ శిక్షణ సెంటర్ ను ప్రారంభించడం కొరకు ఎఫ్ ఎం ఎం సాంఘిక సేవ సమితి డైరెక్టర్ సిస్టర్ సహాయ ఆధ్వర్యంలో మరియు మండల కో..ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ అధ్యక్షతన జరిగినది. కుట్టు శిక్షణ కేంద్రాన్ని మూడు నెలల శిబిరాన్ని ప్రారంభ ఉపన్యాసం చేస్తూ టైలరింగ్ శిక్షణ వలన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్ పాండే అన్నారు. గ్రామంలో నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్య క్రమాన్ని సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ సహకారంతో దీనిని ప్రారంభం చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరైన మహిళలను ఉద్దేశించి తాను మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో టెక్స్టైల్స్ వస్త్ర పరిశ్రమ అనేది ప్రాముఖ్యంగా అభివృద్ధి చెందుతుందని మరియు అందరికీ వ్యాపారానికి అనుగుణంగా అందు బాటులో ఉందని మహిళ లకు టైలరింగ్ శిక్షణ



ఇప్పించడం వలన టెక్స్టైల్స్ పార్కుల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కూడా మెరుగ్గా లభిస్తాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హాజరైన మహిళలకు సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వరంగల్ నేర నిరోధక విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా నైపుణ్య శిక్షణలకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో మానవ మరియు బాలల అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతున్నందున ప్రజలందరూ మహిళలు స్త్రీలు అప్రమత్తమై అవగాహన కలిగి జీవించాలని కోరారు. అలాగే సైబర్ క్రైమ్ నేరాల పట్ల మానవ జీవితంలో నేరాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మహిళలకు ఉందని చెప్పారు. మహిళలకు స్వయం సాధికార సాధించాలంటే స్వయం కృషితో అభివృద్ధి చెందాలని సూచించారు.ఈ కార్యక్రమం నందు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ట్రిబ్యునల్ హనుమకొండ సభ్యులు డాక్టర్ అనిత రెడ్డి మాట్లాడుతూ మహిళలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను మరియు పేదరికాన్ని ఎదుర్కోవడాని కి ఇటువంటి నైపుణ్య శిక్షణ వారిలో ఎంతో ఆత్మ స్థైర్యాన్ని అందించడమే కాకుండా ఆర్థిక పురోగతికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో..ఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ ఫీల్డ్ కో..ఆర్డినేటర్లు ఈసంపల్లి సుదర్శన్ ట్రైనర్ ఝాన్సీ, ఎఫ్ ఎం ఎం అజయ్ కుమార్, రవి, కానిస్టేబుల్ రామారావు, గ్రామ మహిళలు కళ్యాణి, నాగలక్ష్మి, వివో మమత, అంగన్వాడి టీచర్ సుధేష్ణ, దాదాపు 50 మంది నిరుపేద మహిళలు కౌమార బాలికలు పాల్గొన్నారు. టైలరింగ్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని హనుమకొండ జిల్లా సెక్రెటరీ (జడ్జి) ప్రారంభించారు.

# పెను విపత్తులపై పాలకుల మొద్దునిద్ర



మేఘ విస్ఫోటాలు, మెరుపు వరదలు.. ఇటీవలి కాలంలో తరచూ వినబడుతున్న మాటలివి. కుండపోత వర్షాల గురించే తప్ప, వీటి గురించి ఐదారేళ్ల కిందటి వరకూ ఎవరికీ అంతగా తెలియదంటే అతిశయోక్తి కాదు. హిమాలయ పర్వత ప్రాంతాల్లోనూ, దేశంలోని ఇతర పర్వత పంక్తుల్లోనూ ఈ మధ్యకాలంలో తరచూ చోటు చేసుకుంటున్న ఈ తరహా ప్రకృతి వైపరీత్యాలు వెన్నులో వణుకుపుట్టిస్తున్నాయి. మొన్న సంభవించిన మెరుపు వరదల్లో జమ్ము కశ్మీర్ లోని చిసోటీ అనే కుగ్రామం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పటికి 65మంది గల్లంతు కాగా, మరో వందమంది జాడ తెలియడం లేదు. ఇక్కడ మేఘ విస్ఫోటం జరిగిన సమయంలోనే, సరిహద్దులకు ఆవలివైపు పాకిస్తాన్ లోని ఖైబర్ ఫక్తుంఖ్వా ప్రావిన్స్ లో పది గ్రామాలను భారీ వరదలు ముంచెత్తాయి. మూడువందల మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయారు. ఇల్లూవాకిలీ కోల్పోయి అధిక శాతం మంది నిరాశ్రయులయ్యారు. ఇదంతా జరగడానికి పది రోజుల ముందు ఉత్తర కాశీని సైతం మేఘ విస్ఫోటం వణికించింది. గంగోత్రికి వెళ్లే మార్గంలోని ధరాలీ అనే గ్రామాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. యాభైమంది దుర్మరణం పాలు కాగా, వందలాది మంది జాడ ఇప్పటికీ తెలియలేదు. నేపాల్ కూడా తరచూ వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతూ ఉండటం వింటూనే ఉన్నాం. సరిగ్గా ఏడాది క్రితం కేరళలోని వయనాడ్ లో పశ్చిమ కనుమలకు సమీపాన ఉన్న గ్రామాలపై కొండ చరియలు విరిగిపడి వందలాది మంది దుర్మరణం పాలైన సంఘటన గుర్తుండే ఉంటుంది. ఇదంతా చూస్తుంటే మంచుకొండలు, పర్వత పరిసర ప్రాంతాలు తరచూ మేఘవిస్ఫోటానికి, వరదలు, వర్షాల తాకిడికి గురవుతున్నట్లు అర్థమవుతుంది.దీనికంతటికీ కారణం వాతావరణ మార్పులేనని నిపుణులు చెబుతున్న మాటలు కొట్టిపారేయడానికి వీలు లేదు. అడవుల నరికివేత, పట్టణీకరణ పేరిట రోడ్లు, భవంతుల నిర్మాణం ఊపందుకోవడంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది.ఏదైనా ఒక ప్రాంతంలో గంట వ్యవధిలో వంద మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం సంభవించడాన్ని మేఘ విస్ఫోటమని అంటున్నారు. నిజానికి ఈ తరహా కుంభవృష్టి హిమాలయ రాష్ట్రాలకు కొత్తేమీ కాదు. అయితే, ఇటీవలికాలంలో వాటి తీవ్రత, సంభావ్యత పెరగడమే ఆందోళనకరం. భారీ వర్షాలు కురవడానికి సముద్రాలు వేడెక్కడం, భూతాపం వంటి వాతావరణ మార్పులు కారణమవుతున్నాయి. హిందూ మహాసముద్రంలో చోటు చేసుకుంటున్న ఈ రకమైన మార్పుల వల్ల భారత్ సహా పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలు తరచూ ప్రకృతి వైపరీత్యాలకు గురవుతున్నాయి.వరుసగా కొన్ని రోజులపాటు అసలు వర్షాలే లేకపోవడం, అకస్మాత్తుగా కొన్ని రోజులపాటు కుండపోత వర్షాలు కురవడం వంటి సంఘటనలకు భూతాపమే కారణమన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. వయనాడ్, ధరాలీ, చిసోటీ గ్రామాల్లో చోటు చేసుకున్న ప్రకృతి వైపరీత్యాలు ఎన్నికలు, ఓట్ల చోరీ తాజా రాజకీయ పరిణామాల చాటున మరుగున పడిపోతున్నాయి. ఒకదాని వెంట ఒకటిగా సంభవిస్తున్న ఈ పెను ఉత్పాతాలపై దృష్టి సారించి, శాశ్వత పరిష్కారం కనుగొనాలన్న చిత్తశుద్ధి రాజకీయ వర్గాలలో కరవవుతోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడం, మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారం ప్రకటిస్తే చాలునన్న ధోరణి పాలకులలో ప్రబలిపోతోంది. దేశవ్యాప్తంగా ఏయే ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందో కళ్లకు కడుతూ గతంలోనే ఇస్రో లాండ్ స్లైడ్ అట్లాస్ ఆఫ్ ఇండియా పేరిట డేటాబేస్ తయారు చేసింది.ఉపగ్రహాల ద్వారా అందుతున్న సమాచారమూ ప్రకృతి వైపరీత్యాల గురించి అప్రమత్తం చేస్తూనే ఉంది. వీటన్నింటినీ క్రోడీకరించి విపత్తుల నివారణ, నిర్వహణకు ఆయా రాష్ట్రప్రభుత్వాలతో కలసి విధివిధానాలను రూపొందించి, భవిష్యత్తులో మరింతమంది అమాయకులు బలికాకుండా కాపాడవలసిన బృహత్ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ప్రకృతి వైపరీత్యాలకు మనం పగ్గం వేయలేకపోవచ్చు. కానీ, వాటి ఉధృతి పెరిగేందుకు దోహదపడుతున్న మానవ తప్పిదాలను అరికట్టడం మన చేతుల్లోనే ఉంది. వాతావరణ నిపుణులు, ఇస్రో, ఖగోళ శాస్త్రవేత్తలు, విపత్తు నిర్వహణ విభాగపు అధికారులతో సంప్రదింపులు జరిపి, హిమాలయాలు, దేశంలోని ఇతర పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల రక్షణకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి ఓ పథకాన్నిరూపొందించడం అత్యంత ఆవశ్యకం. లేనట్లయితే, ఇలాంటి పెను ఉత్పతాలకు భవిష్యత్తులో మరిన్ని వందలాదిమంది అమాయకులు బలయ్యే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!




# నాగా ఒప్పందంపై తాత్సారం దేనికి

ఈశాన్య భారతంలోని నాగాలాండ్ లో తిరుగుబాటును పరిష్కరించేదిశగా 3015 ఆగస్టు 3న భారత ప్రభుత్వం, నేషనల్ సోషలిస్ట్ ఆఫ్ నాగలిమ్(ఇనాక్-మయినా) (ఎన్ఎస్ సిఎన్-ఐఎం) మధ్య సంతకాలు జరిగిన ఫ్రేమ్ వర్క్ ఒప్పందం ఓ చరిత్రాత్మక ముందడుగు. భారతదేశంలో చాలా దీర్ఘకాలం పాటు సాగిన అంతర్గత సంఘర్షణల్లో ఒకటైన దీనికి శాంతియుత, సమగ్ర పరిష్కారాన్ని వాగ్దానం చేస్తూ, స్వతంత్ర ప్రతిపత్తి, నాగా గుర్తింపు డుమాండ్ల ను పురిష్కరించడం ఈ ఒప్పందం లక్ష్యం. అయితే, ఈ ఫ్రేమ్ వర్క్ అగ్రమెంట్, 2019 ఆగస్టు 5న జమ్మూకశ్మీర్ లో ఆర్టికల్ 370 తో కలిపి అమలు కాకపోవడం, ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక హెూదాతో కూడిన ఒప్పందాలను గౌరవించడంలో భారత ప్రభుత్వం నిబద్ధత పై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.ఈ వ్యాసం నాగా ఫ్రేమ్ వర్క్ ఒప్పందం లో చిక్కులు, దాని అమలులో లోపాలు, ఆర్టికల్ 370 రద్దుతో దాని సంబంధాన్ని చర్చిస్తున్నది. భారతదేశంలోని సమైక్యవాదం, నమ్మకం, ప్రాంతీయ ఆకాంక్షలపై దాని ప్రభావాలను పరిశీలిస్తుంది. నాగా ప్రజలు ప్రత్యేక చరిత్ర, గుర్తింపును గుర్తించడం, సార్వభౌమాధికారం కోసం డిమాండ్లతో 1940 నుంచి నాగా తిరుగుబాటు భారతదేశానికి ఓ ముఖ్యమైన సవాల్ గా నిలిచింది. అత్యంత ముఖ్య నాగా తిరుగుబాటు గ్రూప్ లలో ఒకటైన ఎన్ఎస్సిఎన్ -ఐఎంతో భారత ప్రభుత్వం శాంతి చర్చలు జరిపింది. ఇది ముసాయిదా ఒప్పందంతో ముగిసింది. ఒప్పందంపై అట్టహాసంగా సంతకం చేశారు. ప్రధాని మోదీ దీనిని నాగాలాండ్ , విస్తృత ఈశాన్య ప్రాంతాలలో శాంతి, అభివృద్ధికి మార్గం సుగమం చేసే ఒక మైలురాయిగా అభివర్ణించారు.ఈ ముసాయిదా ఒప్పందం నాగాల ప్రత్యేక చరిత్ర, ఉనికిని గుర్తించింది. భాగస్వామ్య సార్వభౌమాధికారం ఆధారంగా, భారత ప్రభుత్వం, నాగా ప్రజల మధ్య పరస్పర సంబందాన్ని ఏర్పరచడానికి ప్రయత్నించింది. ఈ ఒప్పందం లోని కచ్చితమైన వివరాలు బహిర్గతం కాలేదు. ముఖ్యమైన డిమాండ్లలో స్వయంప్రతిపత్తి, ప్రత్యేక నాగా రాజ్యాంగం, జెండా, నాగాలాండ్, మణిపూర్, అసోం, అరుణాచల్ ప్రదేశ్ లోని నాగా నివాస ప్రాంతాలను ఒకే పరిపాలనా సంస్థగా ఏకీకృతం చేయడం, ఉన్నాయి. దీనిని తరచుగా గ్రేటర్ నాగలిమ్ అని పిలుస్తారు. ఈ ఒప్పందం అహింస, నాగా ప్రజల ఆకాంక్షలను గౌరవించడానని కూడా వాగ్దానం చేసింది. ఒప్పందంపై ఎన్నోఆశలు ఉన్నా,దాని అమలులో పురోగతి నత్తనడకన సాగింది.

# మానవ చరిత్రలో ఒక అద్భుత యానం

జాతీయ విమాన యాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ఘనంగా జరుపుకుంటారు. మానవ చరిత్రలో అత్యద్భుతమైన విప్లవ ఘట్టాల్లో ఒకటైన గగన యానం సాధనకు గుర్తుగా, విమాన యాన రంగంలో మార్గదర్శకుల కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది. రైట్ బ్రదర్స్ 1903 డిసెంబర్ 17న తొలి విజయవంతమైన యాంత్రిక విమానాన్ని ఆకాశంలో ఎగరవేయడం ద్వారా మానవ కలలకు రెక్కలు వచ్చాయి. ఆర్విల్లే రైట్ జన్మదినం ఆగస్టు 19 కావడంతోనే అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్ట్ 1939లో ఈ రోజును విమానయాన దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం సాధించిన పురోగతిని గుర్తు చేసుకుంటూ ఈ రోజును జరుపు కుంటున్నారు. భారతీయ సంస్కృతిలో గగనయాన భావన పూర్వం నుంచే ఉంది.రామాయణం లోని పుష్పక విమానం, మహాభారతం లోని దివ్య రథాలు మన పూర్వికుల ఊహా శక్తిని ప్రతిబింబిస్తాయి. శాస్త్రీయ యుగంలో ఆ కలలు వాస్తవ రూపం దాల్చాయి. భారత దేశంలో విమానయాన చరిత్ర 1911 ఫిబ్రవరి 18న అలహాబాద్ నుండి నైనికి పంపిన పోస్టల్ మెయిల్తో ప్రారంభమైంది. ఆ తర్వాత 1932 అక్టోబర్ 15న జె.ఆర్.డి. టాటా తన డీహావిలాండ్ పూసా-38 విమానం నడిపి కరాచీ నుండి మద్రాస్ వరకు పోస్టు, ప్రయాణికులను రవాణా చేయడం ద్వారా భారతీయ పౌర విమానయాన రంగానికి నూతన దారులు తీశారు. ఆయన ప్రారంభించిన టాటా ఎయిర్లైన్స్ తరువాత ఎయిర్ ఇండియాగా మారి దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచింది. జె.ఆర్.డి. టాటా అందుకే భారతీయ పౌర విమానయాన పితామహుడిగా చిరస్థాయిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం 1953లో ఎయిర్లైన్స్ జాతీయీకరణ చేసి ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్, ఇండియన్ ఎయిర్లైన్స్ను ఏర్పాటు చేసింది.1990ల ఆర్థిక స్వేచ్ఛా విధానాల తరువాత ప్రైవేట్ రంగానికి అవకాశం లభించడంతో జెట్ ఎయిర్వేస్, సహారా, కింగ్ఫిషర్, స్పైస్ జెట్, ఇండిగో, విస్తారా వంటి విమానయాన సంస్థలు రంగప్రవేశం చేశాయి. ప్రస్తుతం ఇండిగో సంస్థ 60 శాతం మార్కెట్ వాటాతో భారత గగనంలో అగ్ర స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 148 ఆపరేషనల్ విమానాశ్ర యాలు ఉన్నాయనే గణాంకం ఈ రంగం విస్తృతతను తెలియజేస్తుంది. ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయం, బెంగళూరు కేమ్పేగౌడ, హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాలు ప్రపంచస్థాయి సౌకర్యాలను కలిగి దేశ గర్వంగా నిలుస్తున్నాయి. 2017లో



ప్రారంభమైన ఉడాన్ పథకం ద్వారా చిన్న పట్టణాలు, దూరప్రాంతాలు కూడా గగనతల రవాణాతో అను సంధానమవడం సామాన్య ప్రజలకు విమాన ప్రయాణం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు 500కి పైగా కొత్త మార్గాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.రక్షణ రంగంలోనూ విమాన శక్తి భారత భద్రతకు కంచుకోటగా నిలిచింది. 1932లో స్థాపించబడిన భారత వైమానిక దళం స్వాతంత్ర్యం తరువాత అనేక యుద్ధాల్లో కీలక పాత్ర పోషించింది. 1965, 1971 యుద్ధాల్లోనూ, 1999 కార్గిల్ ఘర్షణలోనూ వాయుసేన ప్రదర్శించిన ధైర్య సాహసాలు చరిత్రలో నిలిచి పోయాయి. నేడు టెజాస్ వంటి స్వదేశీ యుద్ధ విమానాలతో పాటు సుఖోయ్-30 ఎంఎంకేఐ, రాఫేల్ వంటి ఆధునిక యంత్రాలు భారత రక్షణ శక్తికి బలాన్నిస్తున్నాయి. అంతరిక్ష పరిశోధనలోనూ విమాన శాస్త్రం పునాదిగా నిలిచింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రూపకల్పన చేసిన ఉపగ్రహ ప్రయోగాలు, చాంద్రయాన్, మంగళయాన్ విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. త్వరలో జరగబోయే గగనయాన్ మిషన్ ద్వారా భారతీయులు అంతరిక్షంలో అడుగు పెట్టబోతున్న సందర్భం విమానయాన దినోత్సవానికి మరింత విశిష్టతనిస్తోంది.

# మెగాస్టార్ చిరంజీవి 'స్టాలిన్' రీ రిలీజ్ ట్రైలర్ విడుదల



మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిన చిత్రాల్లో ఒకటైన 'స్టాలిన్' మళ్లీ థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ చిత్రాన్ని ఆగస్టు 22న 4%ఖ% టెక్నాలజీతో రీ-రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో, చిత్ర బృందం మంగళవారం 'స్టాలిన్' 4%ఖ% రీ-రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో మెగా అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. 2006లో ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఒక మంచి సామాజిక సందేశానికి యాక్షన్, ఎమోషన్స్ జోడించి మురుగదాస్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఇందులో చిరంజీవి నటన, ఆయన పలికిన శక్తివంతమైన సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా విడుదలైన 4%ఖ% ట్రైలర్‌లో ఆ పదునైన డైలాగులు, యాక్షన్ సన్నివేశాలు మరోసారి అభిమానులను అలరిస్తున్నాయి. ఈ చిత్రాన్ని చిరంజీవి సోదరుడు నాగబాబు నిర్మించగా, త్రిష కథానాయికగా నటించారు. ప్రకాశ్ రాజ్, ఖుష్బూ కీలక పాత్రల్లో కనిపించి మెప్పించారు. సందేశాత్మక చిత్రం కావడంతో పాటు, చిరంజీవి మార్క్ నటనతో ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులకు కూడా చేరువైంది. రీ-రిలీజ్ సందర్భంగా మెరుగుపరిచిన సాంకేతిక నాణ్యతతో 'స్టాలిన్' చిత్రాన్ని మరోసారి వెండితెరపై చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీ-రిలీజ్ కూడా మంచి వసూళ్లు సాధించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కమల్, రజనీలతో లోకేశ్ మల్టీస్టార్టర్ మూవీ




కూలీ సినిమాతో సూపర్ హిట్‌ని అందుకున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- తెలుస్తుంది. ఇప్పటికే నటుడు కార్తీతో ఖైదీ 2 సినిమాను లైన్‌లో పెట్టిన లోకేష్.. ఈ సినిమా కంటే ముందే మరో బిగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించబోతున్నాడని సమాచారం. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్‌లతో కలిసి కలిసి లోకేష్ ఒక భారీ మల్టీస్టారర్ చేయబోతున్నట్లు- కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇద్దరు వయసు మళ్లిన గ్యాంగ్‌స్టర్ల కథ అని తెలుస్తుంది. ఇద్దరు లెజెండరీ నటుల ఇమేజ్‌కు తగ్గట్టుగా లోకేష్ కనగరాజ్ ఈ కథను సిద్ధం చేశాడని.. ఈ కథకు ఇద్దరు హీరోలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రాన్ని కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ అయిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనుందని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రకటన రాబోతుంది.

# దురుంధర్ మూవీ షూట్‌లో ఫుడ్ పాయిజనింగ్




బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న ధురంధర్ మూవీ సెట్స్‌లో అపశృతి చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తిని దాదాపు 120 మందికి పైగా సినీ కార్మికులు అస్వస్థత గురయ్యారు. దీంతో వీరిని ఆసుపత్రికి తరలించగా.. కార్మికులందరి ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు- అధికారులు చెప్పారు. ధురంధర్ మూవీ షూటింగ్ కోసం వీరందరూ లేహ్‌కి వచ్చినట్లు తెలుస్తుంది. ఇక ఈ ఘటన జరిగిన ప్రదేశం నుంచి ఆహార శ్యాంపిళ్లను విశ్లేషణ కోసం సేకరించారు. ఫుడ్ పాయిజనింగ్ జరిగినట్లు- ఆస్పత్రి డాక్టర్లు చెబుతున్నారు. రణ్‌వీర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ధురంధర్'. ఈ సినిమాకు నేషనల్ అవార్డు విన్నర్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఉరి: ది సర్జికల్ ÷-టస్ట్రైక్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్న రెండవ చిత్రం ఇది. ఈ చిత్రం 2025 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుండగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.

# థగ్ లైఫ్ ఫలితం.. నాన్నను దెబ్బతీయదు

## నటి శృతి హాసన్ కామెంట్స్



అగ్ర హీరోల సినిమాల్లో నటిస్తూ శ్రుతిహాసన్ హిట్‌లను సొంతం చేసుకుంటున్నారు. తాజాగా 'కూలీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించి ఆకట్టుకున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం విజయాన్ని అందుకుంది. ఈసందర్భంగా హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రుతి తన తండ్రి కమల్‌హాసన్ గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రభావం తనపై ఎంతో ఉందన్నారు. నేను కమల్ హాసన్ కుమార్తెగా పరిచయమయ్యాను. కాబట్టి నాపై ఆయన ప్రభావం చాలా ఉంటుంది. నా నటనను ఆయన యాక్టింగ్‌తో పోలుస్తుంటారు. కానీ దానివల్ల నేనెప్పుడూ ఇబ్బంది పడలేదు. ఆయన ఎప్పుడూ నావెంట ఉండడం నా అదృష్టంగా భావిస్తాను. ఇండస్ట్రీలోని ఎంతోమందిలో ఆయన స్ఫూర్తి నింపారు. నాన్న నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఎంత ఎదిగినా ఒదిగిఉండాలని ఆయన దగ్గర నుంచే నేర్చుకున్నాను' అని తెలిపారు. ఇక కమల్ హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' మిశ్రమ ఫలితాలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై శ్రుతిహాసన్ మాట్లాడుతూ.. బాక్సాఫీస్ నంబర్లు కమల్‌హాసన్‌ను ప్రభావితం చేయలేవని తెలిపారు. 'పదేళ్ల క్రితం ఇండస్ట్రీలో ఈ నంబర్ల ప్రస్తావన ఉండేది కాదు. మా నాన్న తన సొంత డబ్బు పెట్టి సినిమా తీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆయనది నంబర్ల గురించి ఆలోచించే మనస్తత్వం కాదు. వాటి గురించి పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటారు' అని శ్రుతి హాసన్ వివరించారు.


# బిగ్ బాస్ హోస్ట్ గా నయనతారకు ఆఫర్!



ఇప్పటివరకూ బాలీవుడ్ బిగ్ బాస్ ని లేడీ బాస్ రూల్ చేసింది రెండు సీజన్లు మాత్రమే. లేడీ సూపర్ స్టార్ నయనతారకు బిగ్ బాస్ హోస్ట్ ఆఫర్ వరించిందా? ఏకంగా బాలీవుడ్ బిగ్ బాస్ హోస్టింగ్ బాధ్యతలే ఇవ్వాలనుకుంటున్నారా? అంటే అవుననే ప్రచారం తెరపైకి వస్తోంది. ఇప్పటివరకూ బాలీవుడ్ బిగ్ బాస్ ని లేడీ బాస్ రూల్ చేసింది రెండు సీజన్లు మాత్రమే. రెండవ సీజన్ ని శిల్పా శెట్టి హోస్ట్ చేయగా, మరో సీజన్ ని పరాఖాన్ హోస్ట్ చేసారు. ఆ తర్వాత మరే నటి హోస్టింగ్ బాధ్యతలు చేపట్టలేదు. అర్షద్ వార్సీ, అమితాబచ్చన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ ఇలా కొంత మంది స్టార్లు హోస్ట్ చేసారు. ఇప్పటికే బిగ్ బాస్ లో మేల్ డామినేషనే కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో తదుపరి సీజన్ హోస్టింగ్ బాధ్యతలు నయనతారు కు అప్పగించాలని నిర్వాహకులు భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో ఇటీవలే నిర్వాహకులు ఆమెను కలిసినట్టు తెలిసింది. నయనతార కూడా పాజిటివ్ గానే స్పందించిందట. కానీ చేస్తాను? లేదా? అన్న తుది నిర్ణయం ఇంకా వెల్లడించనట్లు తెలుస్తోంది. తాను ఎస్ చెప్పినా? నో చెప్పినా పాజిటివ్ గా తీసుకోవాల్సిందిగా కోరిందట. దీన్ని బట్టి నయనతార లో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఇలాంటి అవకాశాలు వస్తే మరో మాట లేకుండా నో చెప్పేది. సినిమా ప్రచారానికి, ప్రకటనలకు చాలా కాలంగా నయనతార దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. ప్రచారం కోసం ప్రత్యేక ప్యాకేజీ ఆఫర్ చేసినా ? నో చెప్పేది. అయితే ఇటీవలి కాలంలో లేడీ సూపర్ స్టార్ కూడా పద్ధతి మార్చింది. మెగా స్టార్ చిరంజీవి 157వ సినిమా ప్రారంభానికి ముందే ప్రీ లాంచ్ ప్రచారంలో పాల్గొంది. దీంతో నిబంధనలు సడలించినట్లు నెట్టింట హైలైట్ అయింది. సొంత బ్యానర్లో సినిమా నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ప్రచారం విలువ తెలుసుకున్న నటిగా హైలైట్ అయింది. ఈ నేపత్యంలోనే చిరంజీవి సినిమా విషయంలో ప్రచారం పరంగా పాజిటివ్ గా ఉన్నట్లు కనిపించింది. తాజాగా బిగ్ బాస్ నిర్వాహకులుతోనూ పాజిటివ్ గా మాట్లాడటం ఆసక్తికరం. మరి ఆమె హోస్ట్ చేస్తుందా? లేదా? అన్నది తేలాలంటే ఇంకా సమయం పడుతుంది. ప్రస్తుతం అమ్మడు నటిగా బిజీగా ఉంది.

# సందేశ సినిమాల్లో నారాయణమూర్తిదే పైచేయి

## నటుడు బ్రహ్మానందం కితాబు



ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యూనివర్సిటీ- పేపర్ లీక్'. ఇది ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో టీమ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్.నారాయణమూర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈరోజు మన దేశ విద్యావ్యవస్థ మారిపోయింది. అది ఎలా ఉంది అనే అంశంపై తమ్ముడు నారాయణమూర్తి రూపొందించిన గొప్ప చిత్రమిది. నాకు ఆయన 40 సంవత్సరాలుగా తెలుసు. నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తారు. ఈ సినిమా కూడా పేద ప్రజల కోసమే తీశారని అన్నారు. నారాయణమూర్తి ఎన్నో త్యాగాలు చేశారు. ఆయన జీవితం మీకు అంకితం. చివరిశ్వాస వరకూ మీకోసం కష్టపడుతూనే ఉండాలని కోరుకుంటున్నాను. ఇది ఎంతో అందమైన సినిమా. ఇందులో నిజాలుంటాయి.. బూతులు ఉండవు, జీవితపు లోతులుంటాయి. 'పెద్ద వాళ్లకు కావాలంటే నాలో అమ్మడానికి చాలా ఉన్నాయి.. కిడ్నీ కూడా ఉంది' అంటూ సాగే కొన్ని డైలాగులు వింటే హృదయం కదిలిపోయింది. ఈ సినిమాను అందరూ చూడాలి. అర్థం చేసుకోవాలి. సమాజం బరువు మోసే వ్యక్తి నారాయణమూర్తి. ఆయన ఒక శక్తి అన్నారు. నారాయణమూర్తి చేసినన్ని మంచి పనులు నేను చేయలేదు. చేస్తానో, లేదో కూడా తెలియదు. నాకు తెలిసినప్పటినుంచి ఆయన ఒకేలా ఉన్నారు. అవే చెప్పులు.. అదే ప్యాంటు-షర్ట్.. అదే ఆటో. ఒక్క సినిమా హిట్ అయితే ఈ రోజుల్లో మనం ఎలా ప్రవర్తిస్తున్నామో అందరికీ తెలుసు. 40 సంవత్సరాల కెరీర్‌లో ఎంతోమంది ఎన్నో ప్రలోభాలు పెట్టినా వాటికి తలొంచలేదు. నాకు వెంకటేశ్వరస్వామి అంటే ఇష్టం.. నారాయణమూర్తి అంటే ఇష్టం' అని అన్నారు. ఇక సినిమాను ఉద్దేశిస్తూ.. ఈ దేశాన్ని మళ్లీ బడిలో వేయాలి అని బ్రహ్మానందం చెప్పారు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. 'తెలుగు చిత్ర పరిశ్రమలో బ్రహ్మానందం మహానటుడు, మహా జ్ఞాని. అన్నిటికీ మించి మాస్టారు. అందుకే ఈ సినిమాను ఆయనకు చూపించాను. ఆయన వెంటనే నా విజ్ఞప్తిని మన్నించి 'యూనివర్సిటీ'ని చూశారు. నన్ను ఆశీర్వదించారు. ఆయన స్పీచ్ వింటుంటే నాకు ఆనందబాష్పాలు ఆగలేదు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.